కర్నూలు I నంద్యాల

వార్త

1 ఆగస్టు, 2024 గురువారం పేజీలు 4


# ముఖ్యమంత్రి పర్యటన పనులను పరిశీలించిన సర్వోన్నతాధికారి



**శ్రీశైలంప్రాజెక్టు, జులై31, ప్రభాతవార్త**

ఏపి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఆగస్టు 1 వ తేదిన శ్రీశైలం రానున్న నేపథ్యాం లో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింటు కలెక్టర్ విష్ణు చరణ్,శ్రీశైలం నియోజకవర్గం శాసన సభ్యులు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి శ్రీశైలం చేరుకోని ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఈక్రమంలోనే బుధువారంనాడు శ్రీశైలం మల్లన్న దర్శనం ఏర్పాట్లు, సుండిపెంట హెలిప్యాడ్ గ్రౌండు ఏర్పాట్లు,ప్రజావేదిక సభా ప్రాంగణం ఏర్పాట్లు, డ్యాం వద్ద జలహారతీ ఏర్పాట్లు, విధ్యుత్ కేంద్ర ఏర్పాట్ల పై కలియతిరిగి అధికారులకు తగు సూచనలు చేసారు. ఈక్రమంలోనే భద్రత పరమైన ఏర్పాట్లపై గ్రేహౌండ్ బలగాలు నల్లమల్ల ప్రాంతమును జల్లేడ పడుతున్నారు. అదే విధంగా పోలీస్ జాగిలాలతో, బాంబ్ స్కాడ్‌తో రహదారుల వద్ద కల్వర్టును ముమ్మరంగా తనీఖిలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే పోలీస్ బలగాలు ముఖ్యమంత్రి రాకపోకలలో ఎక్కడెక్కడ విధులను నిర్వర్తించాలనే అనే అంశాలపై నంద్యాల జిల్లా ఎస్పి అధిరాజ్ సింగ్ రాణా అయా ప్రదేశాలను స్వయంగా పర్యటించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అదికారులను ఆదేశిస్తున్నారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలన్ని ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా 1100 మందితో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసారు.



# వందరోజుల్లో స్నేహపూర్వక పారిశ్రామిక విధానం

**- రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య, ఆహారశుద్ధిశాఖ మంత్రి టీజీ భరత్**



**కర్నూలు హాస్పిటల్, జూలై 31, ప్రభాతవార్తః** రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షించి తద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రానున్న వందరోజుల్లో స్నేహపూర్వ పారిశ్రామిక విధానాన్ని రూపొందించను న్నట్లు రాష్ట్ర పారిశ్రామిక, వాణిజ్య, ఆహారశుద్ధిశాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. బుధవారం రాష్ట్ర సచివాలయం 4వ బ్లాక్ పబ్లిసిటి సెల్‌లో పాత్రికేయు లతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరిశ్రమల శాఖ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి రాష్ట్రంలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు తీసుకురావాల్సిన నూతన పాలసీలపై పలు అదేశాలు జారీచేసినట్లు తెలిపారు. గత పది సంవత్సరాల కాలంలో పెట్టుబడుల కోసం వివిధ సందర్భాల్లో చేసుకున్న ఒప్పందాలు వాటి ప్రస్తుత పరిస్థితిపై అధికారులతో ముఖ్యమంత్రి చర్చించారన్నారు. వచ్చే వందరోజుల్లో దేశంలోనే ఉత్తమమైన నూతన ఇండస్ట్రియల్ పాలసీ, ఎంఎస్ఎంఈ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఇండస్ట్రియల్, క్లస్టర్ పాలసీలను తీసుకురావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారులను అదేశించారన్నారు. వీటికి సంబంధించి డ్రాఫ్ట్ పాలసీలను రానున్న 15 రోజుల్లో రూపొందించి ఆడ్రాఫ్ట్ పాలసీపై స్టేక్ హోల్డర్‌లు అందరితో పూర్తిస్థాయిలో చర్చించి దేశంలోనే ఉత్తమైన పాలసీలను రూపొందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అపారమైన వనరులు ఉన్నాయని వాటికి తోడు రాష్ట్రానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్ద బ్రాండ్ అని ఆయన మీద ఉన్న అపారమైన విశ్వాసంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివస్తాయని ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడిదారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఒకేపాయింట్‌లో అన్ని అనుమతులు మంజూరు చేసే విధానం కూడ అమలులోకి తేనున్నామన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతికి దగ్గరలో ఉన్న కృష్ణా జిల్లా మల్లవల్లి పారిశ్రామిక వాడలో తమ ప్రభుత్వ హయాంలో ఎకరం రూ.8లక్షల నుండి రూ.16 లక్షల వరకు ఉంటే గత ప్రభుత్వం ఆ ధరను రూ.85 లక్షల నుండి రూ.90 లక్షల వరకు పెంచడం జరిగిందన్నారు. ఈపారిశ్రామిక వాడలో భూముల రేట్లు తగ్గించి పెట్టుబడులకు ఊతం ఇవ్వాలని ముఖ్యమంత్రి అదేశించారని అందుకు తగ్గట్టుగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఓర్వకల్లు, కృష్ణపట్నం ఏపీ బల్క్ డ్రగ్ పార్కు, కొప్పర్తి క్లస్టర్‌లు ఉన్నాయని వాటికి అదనంగా నూతనంగా మరో 4 నాలుగు పారిశ్రామిక క్లస్టర్‌లను కుప్పం, లేపాక్షి, సత్యసాయి జిల్లా, శ్రీకాకుళం, మూలపేట, ప్రకాశం జిల్లాలోని దొనకొండలో అభివృద్ధి పరచాలని ముఖ్యమంత్రి అదేశించారని రానున్న రోజుల్లో వాటిని కూడ అభివృద్ధి చేస్తామన్నారు. రానున్న ఏడాదిలో రూ.1350 కోట్లతో చిత్తూరు నోడ్‌ను అభివృద్ధి పరచనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 34 శాతం ప్రోత్సాహకాలను విడుదల చేయడం జరిగిందన్నారు. ఎంఎస్ఎంఈ టెక్స్‌టైల్ రంగాలకు సంబంధించి దాదాపు రూ.5 వేల కోట్ల మేర ప్రోత్సాహకాలు చెల్లించాల్సి ఉందని వచ్చే ఐదేళ్ళకు మరో రూ.5 వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈప్రోత్సాహకాలను అన్నింటిని ఏవిధంగానైనా చెల్లించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారన్నారు. రాష్ట్ర పరిశ్రమలశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎన్ యువరాజ్ సమావేశంలో పాల్గొన్నారు.

# వర్షాలు లేక.. ఎండిపోతున్న పంటలు..!

- పంటలు కాపాడుకోవడానికి రైతన్న అవస్థలు
- వానదేవుడా కరుణించవా అంటూ పూజలు,ప్రార్థనలు
- మరో వారం రోజులు వర్షాలు రాకపోతే పంటలు పూర్తిగా పోయినట్లేనని ఆవేదన





**పెద్దకడుబూరు, జూలై 31,ప్రభాతవార్త**

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే వర్షాలు కురిసి రైతులను ఊరించిన మేఘాలు పంటలు వేసి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన తర్వాత పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి అవస్థలు పడుతున్నారు. పెద్దకడుబూరు మండలంలో పలు గ్రామాల్లో పత్తి,వేరుశనగ, సజ్జ,జొన్న తదితర పంటలు సాగు చేశారు. చాలామంది రైతులు ముంగారు వర్షాలకే తమ పొలంలో గంపెడు ఆశలతో పత్తి పంటను వేయగా అవి ప్రస్తుతం మొగ్గ పూత కాయ దశలో ఉన్నాయి. ఈ సమయంలో వర్షాలు రాకపోవడంతో ఆ పంటలు ఎండలకు మాడిపోవడం చూసి రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. కొంతమంది రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి నీళ్లను ట్యాంకర్లతో ట్యాంకర్ల ద్వారా తీసుకొచ్చి తమ పంటలకు వేసుకుంటున్నారు. నీటిని తెచ్చుకునే స్థోమత లేని రైతులు చేసేదేమీ లేక చేతెలెత్తేస్తున్నారు. వర్షం కోసం రైతులు గుళ్లు,గోపురాల చుట్టూ తిరుగుతూ ప్రార్థనలు చేస్తున్నారు. ఓ మేఘమా కరుణించవా అంటూ వాన దేవునికి పూజలు చేస్తున్నారు. మరో వారం రోజులు వర్షాలు కురవకపోతే తమ పంటలు పూర్తిగా పోయినట్లేనని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రైతులు ఈ సీజన్‌లో వర్షాలు బాగా కురుస్తాయని నమ్మి వేలాది రూపాయలు అప్పులు చేసి ఒకటికి రెండుసార్లు విత్తనాలు,ఎరువులు కొనుగోలు చేసి తమ పొలాల్లో పంటలు వేసిన రైతులకు వర్షాలు రాకపోవడంతో పంటలు చేతికి రాక రైతులపై మరికొన్ని అప్పులు పెరిగే అవకాశం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని వాన దేవుడు కరుణించి విస్తారంగా వర్షాలు కురిసి రైతులకు పంటలు చేతికి రావాలని హిందూ, ముస్లిం,క్రైస్తవులు వారి వారి దేవాలయాల్లో ప్రార్థనలు చేస్తున్నారు.

# అన్ని గ్రామాలకు.. జనవరి కల్లా తాగునీరు

- సమీక్షలు చేయడమే కాదు సమస్యలను పరిష్కరించండి
- నగర పంచాయతీ నిధుల కోసం కృషి చేస్తాను
- కుక్కలు పందులు ఆవులు జింకల బెడదను పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా వెళ్దాం - ఎమ్మెల్యే కోట్ల



**బేతంచెర్ల, జూలై 31, ప్రభాతవార్త:**

బేతంచెర్ల నగర పంచాయతీతోపాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు 2025 జనవరి కల్లా జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు అందిస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ సి.హెచ్.చలంరెడ్డి అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే కోట్ల ఎక్స్ అఫిసియో సభ్యుడిగా హాజరయ్యారు. సమావేశంలో కౌన్సిలర్లు లెవనెత్తిన సమస్యలు, చైర్మన్ నిధుల విషయంలో సహకరించాలని ఎమ్మెల్యేను కోరడం పై ఆయన స్పందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర పంచాయతీతోపాటు డోన్, ప్యాపిలి అన్ని ప్రాంతాల్లో ఆవులు, కుక్కలు, పందులతోపాటు జింకల బెడద ఎప్పటి నుంచో ఉందన్నారు. వీటి పరిష్కారం కోసం ప్రణాళిక బద్ధంగా వెళ్లాలని జంతుసంరక్షణ చట్టంలోని 5లో ఉన్నటువంటి జంతువులను మాత్రమే తొలగించేందుకు అవకాశం ఉంటుందని మిగిలిన వాటిని చట్టపరంగా వైద్యుల సలహా మేరకు నిపుణుల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించడమా లేదా వైద్యపరమైన చికిత్సల ద్వారా వాటి బెడదను తగ్గించడమా చేయాలన్నారు. అలాగే నగర పంచాయతీకి 2020లో అప్పటి ప్రభుత్వం రూ.42కోట్లు మంజూరుచేసి రూ.20కోట్లు రెండు విడతల్లో విడుదల చేసిందని మిగిలిన వాటిని విడుదల చేసేలా చూడాలని చైర్మన్ ఎమ్మెల్యే దృష్టికి తెచ్చిన అంశం పై ఆయన మాట్లాడుతూ నిధుల విషయంలో ఖచ్చితంగా ప్రభుత్వంతో మాట్లాడి రాబట్టేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే సమావేశాల్లో కౌన్సిలర్లు లెవనెత్తిన సమస్యలను రాసుకుని వాటిని పరిష్కరించామని లేదా వివిధ స్థాయిల్లో ఉన్నాయన్న విషయాన్ని కౌన్సిలర్లకు తిరిగి సందేశం పంపేలా పనిచేయాలని అధికారులకు సూచించారు. కేగోరుకల్లు రిజర్వాయర్ నుండి జలజీవన్ పథకం ద్వారా జనవరి 2025 నాటికి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటిని అందించడం జరుగుతుందన్నారు. అలాగే రోడ్ల నిర్మాణం, మురుగు నీటి కాలువల ఏర్పాటు, ఇతర అంశాల పై గుత్తేదారులు నిర్లక్ష్యం వహించి పనులు చేపట్టడంలో జాప్యం వహిస్తే అలాంటి వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టండన్నారు. లేఔట్లల్లో పంచాయతీ ఆస్తులను ఆక్రమించిన వారికి నోటీసులు ఇచ్చి వారి పై అవసరమైన మేరకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముందుగా కౌన్సిలర్ ఇబ్రహీమ్ మాట్లాడుతూ ఎల్‌పీ నంబరు 78-91, సర్వే నంబర్ 219 నందు గొల్ల లావణ్య వైఫ్ ఆఫ్ గొల్ల పద్మనాభం అనే పేరు మీదుగా పంచాయతీ ఓపెన్ సైట్ నందు 288.758 చదరపు గజాలు రిజిస్టర్ చేయించుకున్నారని వాటి పై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరించాలన్నారు. దీని పై కమిషనర్ వివరణ ఇస్తూ సంబంధిత స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడంతోపాటు రిజిస్ట్రార్ ఆఫీస్‌కు, బ్యాంకులకు దీని పై ఎలాంటి లావాదేవీలు జరపవద్దని నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశ అనంతరం తెలుగుదేశం నాయకులు, కౌన్సిలర్లు నగర పంచాయతీ ఆవరణంలో గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, నగర పంచాయతీ సిబ్బంది, టీడీపీ నాయకులు యల్ల నాగయ్య, బుగ్గన ప్రసన్న లక్ష్మి, బుగ్గన ప్రభాకర్‌రెడ్డి, పోలూరు రాఘవరెడ్డి, న్యాయవాది భాస్కర్‌రెడ్డి, ఎరుకలిచెరువు శివ, రాఘవరెడ్డి, రంగనాయకుల యాదవ్, పలువురు నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీలంసాగర్ నుండి నాగార్జునుని చెంతకు.. కృష్ణమ్మ

## : 8 క్రస్ట్‌గేట్లతో సాగిపోతున్న శ్రీశైలం డ్యాం



**శ్రీశైలంప్రాజెక్టు, జులై31, ప్రభాతవార్త**

నీలంసాగర్ డ్యాం నుండి కృష్ణమ్మ ఎగిసిపడుతూ సందర్శకులను కట్టిపడేస్తుంది. గంగమ్మ అందాలను తిలకిస్తూ యాత్రికులు మురిసిపోతున్నారు. కృష్ణమ్మ చిరుజల్లులతో యాత్రికులు సందండి చేస్తున్నారు. నాగార్జునుని చెంతకు తరలిపోతున్న గంగమ్మ వాగులు, వంకలను సైతం కలుపుకుంటూ వడివడిగా సాగిపోతుంది. శ్రీశైలం జలశయంకు తెలంగాణా రాష్ట్రం హైదరబాద్ నుండి యాత్రికుల తాకిడి పెరిగగింది. రహదారులన్ని వాహనాలతో కిక్కిరిసి పోతున్నాయి. లక్షాలాది క్యూసెక్యుల నీరు పరుగు పరుగున జలసవ్వడి చేసుకుంటూ సాగివస్తుంది. ఎగువ జలాశయాలు నిండుకుండలను తలపించడంతో ఎగువన ఉన్నా జూరాల, తుంగభద్రలు పొంగిపోర్లాయి. కదలిపోతున్న జలదారాలతో రిజర్వయర్ పరిసర ప్రాంతాలన్ని వర్షపు జల్లుతో తడిసి ముద్దాయితున్నాయి. ఈ సుందర దృష్యం చూసేందుకు యాత్రికులు తండోప తండాలుగా శ్రీశైలం డ్యాం వద్దకు తరలివస్తున్నారు. వడివడిగా నాగార్జునుని చెంతకు తరలి వెళ్తు సందర్శకులను చిరుజల్లులతో పలరిస్తుంది. గంగమ్మ అందాలను చూస్తూ సందర్శకులు తమ చరవాణిలో బందించుకుంటున్నారు. ఈక్రమంలోనే శ్రీశైలం 8 రెడియల్ క్రస్ట్‌గేట్లను తెరచి ఒక్కోక్కటి 10 అడుగుల ఎత్తుమేరకు తెరచి స్పిల్‌వే గుండా 2,23,768 క్యూసెక్యూల నీరు, కుడిగట్టు విధ్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అనంతరం 24,917 క్యూసెక్యుల నీరు, ఎడమగట్టు విధ్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అనంతరం 35,315 క్యూసెక్యుల నీరు మొత్తం 2,84,000 క్యూసెక్యుల నీటిని దిగువకు విడుదల చేయడం జరుగుతుంది. అదే విధంగా ఎగువ పరివాహ ప్రాంతమైన జూరాల గేట్ల ద్వారా 2,58,285 క్యూస్యేక్యుల నీరు, విద్యుత్ ఉత్పత్తి గుండా 19,272 క్యూసెక్యుల నీరు, సుంకేసుల నుండి 16,256 క్యూసెక్యుల నీరు, మొత్తం శ్రీశైలం డ్యాంకు ఇన్‌ఫ్లోగా 2,93,813 క్యూసెక్యుల నీరు వచ్చిచేరుతుంది. కాగా బుదువారం సాయంత్రం 6 గంటలకు డ్యాం నీటిమట్టం 884.50 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 212.9198 టియంసిలుగా నమొదు అయింది. లక్షాలాది క్యూసెక్యుల నీరు జలశయంకు వచ్చిచేరుతుండడంతో ఇంజనీర్లు ఎప్పటికప్పుడు అంచన వేస్తు డ్యాం క్రస్ట్‌గేట్ల సంఖ్యాను పెంచుతు, తగ్గిస్తూ ఉన్నారు. శ్రీశైలం జలశయంకు వచ్చిచేరుతున్న వరద నీటి ఉధృతి కొంత మేరకు తగ్గుముఖం పట్టింది.



# ఎన్నికలపై కార్పొరేటర్లకు అవగాహన

- స్థాయి సంఘం ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధం
- తొలిసారి ఎన్నికలు...రేపే పోలింగ్, లెక్కింపు
- లోటుపాట్లు లేకుండా పకడ్బందీ చర్యలు
- నగర పాలక కమిషనరు రామలింగేశ్వర్



**కర్నూలు మున్సిపల్, జూలై 31, ప్రభాతవార్తః**

నగరపాలక సంస్థ స్థాయి సంఘం సభ్యుల ఎన్నికకు సంబంధించి ఓటు వేసే విధానాన్ని కార్పొరేటర్లకు కమిషనరు పి వి రామలింగేశ్వర్ అవగాహన కల్పించారు. కార్యక్రమానికి మేయర్ బి వై రామయ్య, కార్పొరేటర్లు, అధికారులు హాజరయ్యారు. ముందుగా పోలింగ్ జరిగే విధానాన్ని, ఫలితాల లెక్కింపు ప్రక్రియను వివరించారు. అనంతరం పలువురు కార్పొరేటర్లు లేవనెత్తిన సందేహాలను కమిషనరు నివృత్తి చేశారు. ఓటు వేయడానికి కార్పొరేటర్లు పార్టీ కండువాలతో, మొబైల్ ఫోన్లతో రాకూడదని, బ్యాలెట్ నమూనాలో పది మంది అభ్యర్థులలో గరిష్టంగా ఐదు మందికి ఓటు వేసే అవకాశం ఉంటుందన్నారు. అపై ఎక్కువ ఓట్లు వేసినా, అభ్యర్థికి ఎదురుగా కాకుండా అటు ఇటుగా వేసినా మొత్తం బ్యాలెట్ ఓట్లు చెల్లవిగా పరిగణిస్తామన్నారు. అలాగే పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం కమిషనరు రామలింగేశ్వర్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా నగరపాలక స్థాయి సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా సాగగా తొలిసారి ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు లోటుపాట్లు జరగకుండా పకడ్బంది చర్యలు తీసుకున్నామన్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. అత్యధిక ఓట్లు పోలైన ఐదు మంది అభ్యర్థులను విజేతలుగా ప్రకటిస్తామన్నారు.

# నేటి నుంచి పెన్షన్‌ల పంపిణికి సర్వం సిద్ధం

**నంద్యాల విద్య, జూలై 31, ప్రభాతవార్తః**

రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 1న పెన్షన్ పంపిణి కోసం నియమించబడిన సిబ్బంది అందరు ఉదయం 6 గంటలకే పంపిణి ప్రారంభించాలని అధికారులు అదేశాలు జారీచేశారు. వృద్దులు, వితంతువులు, వికలాంగుల అందరికి కూడ మొదటి రోజే 99 శాతం పంపిణి చేయాలని అధికారులు సూచిస్తున్నారు. ఏదైనా అనివార్య కారణాల వల్ల సాంకేతిక సమస్యలు తలెత్తితే తప్పా రెండవరోజు పంపిణి చేయాల్సి ఉంటుంది. పెన్షన్ల పంపిణిపై అన్ని గ్రామాల్లో సోషల్‌మీడియా, టాం టాం, బహిరంగ ప్రదేశాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలి. సచివాలయాల వారిగా పెన్షన్ల మొత్తాలు ఇప్పటికే రాష్ట్రంలోని అందరి కమిషనర్లకు, ఎంపీడిఓలకు పంపిణి చేశారు. 1వ తేదిన చెల్లింపు పూర్తియిన తరువాత మిగిలిన వారికి రెండవ తేది చెల్లించాలని అదేశించారు. ఎంపీడిఓలు, కమిషనర్లు పెన్షన్ పంపిణిలో ఎలాంటి అవకతవకల జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# మహిళ అర్థిక సౌలభ్యము కోసమే మహిళా మార్ట్

**- మంత్రి ఫరూక్**

**నంద్యాల, జూలై 31,ప్రభాతవార్తప్రతినిధి**

మహిళల అర్థిక సౌలభ్యము కోసమే ఈమహిళా మార్ట్ నిర్మాణము చేస్తున్నామని రాష్ట్ర న్యాయ.ముస్లీమైనార్టి సంక్షేమ శాఖ మంత్రి యన్‌యండి ఫరూక్ అన్నారు. బుదవారము నంద్యాల యస్‌అర్‌బి కాలనీలో ఉన్నటిడ్కో ఇళ్ల వద్ద మహిళా మార్ట్ భవనమునకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భముగా మంత్రి మాట్లాడుతూ మహిళలు అర్థికంగ ఎదగడానికి మహిళ మార్టు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే ఇక్కడున్న కాలనీ, అలాగే టిడ్కో ఇళ్లు కూడా డెవలప్ చెందుతున్నాయని అయన చెప్పారు. ఇక్కడ మార్టు ఎంత శరవేగము అబివృద్ది అవుతే అంతే వేగముగా కాలనీ కూడా అబివృద్ది చెందుతుందని చెప్పారు. అక్కడనే చాలా మంది మంత్రి దృష్టికి పలు సమస్యలను తెచార్రు. దీనికి స్పందించిన మంత్రి అక్కడే ఉన్న మున్సుపల్ కమీషనరుకు సిబ్బందికి పలు సూచనలు చేవారు. యస్‌అర్‌బి కాలనీలో రోడ్డు కాలువలు, వీది ద్వీపాలు మంచి నీటి సౌకర్యము ఏర్పాట్లు చేస్తామని మంత్రి చెప్పానరు. గత వైసిపి ప్రభుత్వంలో కేవలముల రంగులు కొట్టుకోవడము కోసమే కాలం గడిపారని ఎద్దేవ వేశారు. నంద్యాల్లో ఏ సమస్య వచ్చిననేనున్నాంటూ మంత్రి ఫరూక్ భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో మున్సుపల్ కమీషనరునిరంజన్‌రెడ్డి, మున్సుపల్ చైర్మన్ మాబున్నీసా, వైచైర్మన్ గంగిశెట్టి శ్రీధరు, పాంషావలి, కౌన్సులర్లు మాజీ కౌన్సిలర్లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# మున్సిపల్ సమావేశంలో అజెండాలో రెండు పద్దులు రద్దు



**నంద్యాల విద్య, జూలై 31, ప్రభాతవార్త:** మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ నాయకుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ మాబున్నిసా అధ్యక్షతన జరిగిన కమిషనర్ నిరంజన్‌రెడ్డి సభా కార్యక్రమాలు నిర్వహించారు. వేలం పాటల విషయంలో మున్సిపల్ అధికారులు గోప్యం...గోప్యం అన్నవార్త కథనం వార్తపత్రికలో ఈనెల 27న ప్రచురితమయింది. షాపుల అద్దెల పెంపదల విషయంలో అధికారులు వేలం పాటల నిర్వహణ ఎందుకు గోప్యం చేస్తున్నారని మాజీ చైర్మన్ ఎన్‌జిఓ కాలనీ కౌన్సిలర్ దేశం సులోచన కమిషనరును నిలదీశారు. ఆమె మాట్లాడుతూ గతంలో వేలం పాటల విషయంలో పబ్లిసిటి చేసేవారని కమిషనరు ఒకటి రెండు పత్రికలకు తూతు మంత్రంగా యాడ్స్ ఇచ్చి ఏవరికి తెలియకుండా వేలం పాటలు నిర్వహించడం సరికాదని పేర్కొన్నారు. గత సంవత్సరం వేలం పాటల విషయంలో ఆటోపెట్టి తిప్పితే ఇంతవరుకు వారికి అమౌంట్ ఎందుకు ఇవ్వలేదని కమిషనరును సభాముఖంగా ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా షాపుల అద్దెల పెంపుదల జరుగుతుందని 60శాతం పెంచడం సబబా అంటు ప్రశ్నించారు. రూ.2వేలు ఉన్న అద్దెను రూ.10 వేలు చేసి భారం వేయడం సబబు కాదని సభ్యులు పేర్కొన్నారు. అజెండాలోని 26 అంశాలలో రెండు అంశాలను రద్దుచేసి 24 అంశాలను సభ అమోదించింది. 2018-19లో చేసిన పనులకు నిధులు ఇవ్వాలంటే తగదని నాల్గవ అంశాన్ని రద్దుచేశారు. 18వ అంశంలో 60 అడుగుల రోడ్డు విషయంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం ఉండాలని రద్దుచేశారు. పలు విషయాలలో కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం జరిగింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ వార్డుల్లో పనులు చేపట్టాలని అజెండాలో పొందుపరచడం విశేషం. 27వ వార్డు కౌన్సిలర్ జైనాబి గత మూడు సంవత్సరాలుగా తనవార్డులో ఒక్కపైసా నిధులు ఇవ్వలేదని గతంలో పలుమార్లు కౌన్సిల్‌లో పేర్కొన్నప్పటికి పట్టించుకోలేదు. ప్రభుత్వం వచ్చిందని ఆ వార్డులో సిసి రోడ్డు కోసం రూ.31.50లక్షలు నిధులు కేటాయించారు. 25వ వార్డు కౌన్సిలర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ కమిషనరు వార్డుల్లో పర్యటించినప్పుడు కౌన్సిలర్లకు సమాచారం కూడ ఇవ్వరని పేర్కొన్నారు. 12వ వార్డు కౌన్సిలర్ ఖండే శ్యాంసుందర్‌లాల్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ ఏమి అభివృద్ధి చేయలేదని టిడిపి ప్రభుత్వం వచ్చిన 50 రోజులు అయిందని భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేస్తామని పద్మావతినగర్ నడిబొడ్డున ఉన్న 3 ఎకరాల స్థలం క్రీడలకు ఇచ్చిన స్థలాన్ని వెనక్కు తీసుకోవాలని సూచించారు. కమిషనరు అధికారులు చైర్మన్‌కు తెలియకుండా అజెండాలో అంశాలను పొందుపరుస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతినెల 1వ తేది నుంచి 15వ తేదిలోపు కౌన్సిలర్లు తమవార్డుల్లో ఉన్న సమస్యలను లెటర్‌ప్యాడ్‌పై రాసిఇస్తే పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## మహిళా సర్పంచ్‌పై బలత్కారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

**ఆదోని రూరల్,జూలై 31,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దపెండేకల్ గ్రామానికి చెందిన సర్పంచ్ జయమ్మపై అదే గ్రామానికి చెందిన తలారి నరసింహులు అనే వ్యక్తి బలత్కరించడానికి ప్రయత్నించి ఆఖరికి ఆమెను చంపడానికి ప్రయత్నించడం భాదాకరమని,నింధితుడిని కఠినంగా శిక్షించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య,జిల్లా కార్యవర్గ సభ్యులు విరుపాక్షి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు,సిపిఐ సీనియర్ నాయకులు గోపాల్‌లు డిమాండ్ చేశారు. సిపిఐ,వ్యకాస ఆద్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జయమ్మను బుధవారం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలన్నారు. భాదితురాలు ఫిర్యాదు చేయడానికి పోలీస్‌స్టేషన్‌కు వెళితే సంబంధిత స్టేషన్ ఆఫీసర్ భాదితురాలి పట్ల సక్రమంగా స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండ నింధితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి,పట్టణ కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యులు,సీనియర్ నాయకులు పాల్గొన్నారు.ఉప్పర సంఘం నాయకులు పరామర్శ : మండల పరిధిలోని పెద్దపెండేకల్ గ్రామ సర్పంచ్ జయమ్మపై అత్యాయత్నం,హత్యాయత్నం జరగడాన్ని జిల్లా భగీరథ సగర/ఉప్పర సంఘం తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యన్న అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉప్పర జయమ్మను బుధవారం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరేంద్ర,ఆర్గనైజింగ్ కార్యదర్శి చరణ్‌తేజ్,లీగల్ అడ్వైజర్ కుమార్ లింగమూర్తి,సంఘం సీనియర్ నాయకులు ఏపి వీరన్న,జిల్లా ఉపాధ్యక్షులు బసలదొడ్డి వీరేష్‌లు పరామర్శించి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎర్రిస్వామిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తాలుక సిఐ నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు.

## అథ్లెటిక్ పోటీల్లో రజత పతకం సాధించి ప్రతిభ చాటిన విద్యార్థి రాధమ్మ




**ఆదోని రూరల్,జూలై 31,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్దహరివాణం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత కన్నడ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాధమ్మ అథ్లెటిక్ పోటీల్లో రజత పతకాన్ని సాధించిందని ఇంచార్జ హెచ్‌ఎం రమణమూర్తి,వ్యాయామ ఉపాధ్యాయుడు రామన్నలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ ఆలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత నెల 30న ఆర్డీటి ఆద్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో రాధమ్మ 200మీటర్ల పరుగు పందెం విభాగంలో రజత పతకాన్ని సాధించిందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఇందిరాదేవి,ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు, విద్యార్థులు రజత పథకం సాధించిన రాధమ్మను అభినందించారు.

## మొక్కలు పంపిణీ



**ఆదోని రూరల్,జూలై 31,ప్రభాతవార్త :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని 18గ్రామాల నందు మంజూరు చేయబడిన 45మంది రైతులకు బుధవారం మద్యాహ్నం స్థానిక బైపాస్ రోడ్డు నందు ఎద్దుల మార్కెట్ వద్ద ఎమ్మెల్యే పార్థసారథి చేతుల మీదుగా 7883పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. నిమ్మ 11577,కొబ్బరి 2412,జామ 663,మామిడి 2398 మొత్తం 7883 మొక్కలను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జ మల్లప్ప,టిడిప నాయకులు గుడిసె కృష్ణమ్మ,భాస్కర్‌రెడ్డి,ఎంపిడిఓ శేఖర్,ఏపిఓ కలిక్ తదితరులు పాల్గొన్నారు.

## జ్వాలవీరభద్రస్వామివారికి విశేష పూజలు



**శ్రీశైలంప్రాజెక్టు,జూలై31,ప్రభాతవార్త :** లోకకల్యాణం కోసం దేవస్థానం బుదువారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని వీరభద్రస్వామివారికి(జ్వాలవీరభద్రస్వామివారికి)విశేష పూజలు నిర్వహించడం జరిగింది.ఆలయప్రాంగణంలోని మల్లికార్జుస్వామివారికి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్టరూపంలో దర్శనమిస్తాడు.శిల్పాశాస్త్ర పరిబాషలో ఈ స్వామికి ఆఘోరవీరభ్ద్రమూర్తి అని పేరు కూడా ఉంది.కాగా ప్రతి బుదువారం ప్రదోషకాలంలో విశేష అబిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది.కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహగణపతిపూజను నిర్వహించబడింది.తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ,ఫలు రకాల ఫలోదాకాలతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతోనూ విశేష అభిషేకం నిర్వహించడం జరిగింది.ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడింది.

## 8న పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నిక

**పాములపాడు, జూలై 31, ప్రభాతవార్త:** ఈనెల 8న పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యుల ఎన్నిక జరగనుందని మండల విద్యాధికారి బాలాజీ నాయక్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం పాఠశాల పేరెంట్స్ కమిటీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడనుందని అలాగే అదేరోజు ఓటరు జాబితా ప్రదర్శన చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. 5న ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరణ ఫిర్యాదులుంటే వాటిని పరిష్కరించడం, ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శనున్నట్లు తెలిపారు. 8న పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులచే చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక ఉంటుందని వెల్లడించారు.

## తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్పించాలి



**కర్నూలు హాస్పిటల్, జూలై 31, ప్రభాతవార్త:** గర్భం దరించిన సమయం నుండి కాన్పు అయ్యేదాక ఆరోగ్యకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు తల్లిపాల అవశ్యకతపై అవగాహన కల్పించాలని రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ అధికారిని హేమలత అన్నారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన అసుపత్రి అవరణ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను పురష్కరించుకొని తల్లులతో సమావేశం నిర్వహించడం జరిగింది. తల్లిపాలు తల్లికి, బిడ్డకు మధ్య ప్రేమ బాంధవ్యాన్ని పెంపొందించి భావోద్వేగాలు కలిగిస్తాయి. తల్లిపాలు తాగే పిల్లల్లో ఎక్కువ బలం ఉంటుంది. వ్యాధి నిరోధకశక్తి, తెలివితేటలు ఎక్కువగా ఉంటాయి. బిడ్డకు రోజు కనీసం 8 నుంచి 10 సార్లు పాలు ఇవ్వాలన్నారు. డా.సృజన మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రు పాలు పట్టించాలి. ముర్రుపాలల్లో కోలెస్ట్రామ్ అనే హార్మోన్ ఉంటుందని, ఈహార్మన్ పిల్లలకు పూర్తి వ్యాధి నిరోధకంగా పనిచేస్తుందని, 6 నెలలు మాత్రమే తల్లిపాలు తాపించాలని, ఆ తరువాత తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. ముర్రుపాలు బిడ్డకు అమృతం లాంటిందని తెలిపారు. పాలిచ్చే తల్లుల్లో నెలసరి రక్తస్రావం తక్కువగా ఉంటుందని పాలిచ్చినంతకాలం మళ్లి గర్భం రాకుండా గర్భనిరోధకంగా కూడ పనిచేస్తుందన్నారు. అనంతరం హేమలత వైద్యులతో, సిబ్బందితో మరియు తల్లులతో తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో దంత వైద్యాధికారి డా.లక్ష్మిరెడ్డి, మేనేజరు ఇర్ఫాన్, డైస్ సిబ్బ ంది, ప్రొజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

## ఫాస్టాగ్ యూజర్లుకు అలర్టు -ఆగష్టు I నుంచి కొత్త రూల్స్ అమలు

**నంద్యాల విద్య, జూలై 31, ప్రభాతవార్త:** ఫాస్టాగ్ ఉపయోగించే యూజర్లు ఆగష్టు 1 నుంచి కొత్త రూల్స్ అమలు చేస్తు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు కేవలం వాహనదారులే కాకుండా ఫాస్టాగ్ జారీచేసే కంపెనీలు కూడ అలర్టు కావాలి. కెవైసి అప్‌డేట్ చేసుకోవాలి. ఐదు సంవత్సరాల కిందటి ఫాస్టాగ్‌లను రిప్లేస్ చేసుకోవాలి. అక్టోబరు 31 కల్లా ఈప్రక్రియను పూర్తి చేయాలి. దీని వల్ల అయా ఫాస్టాగ్ హోల్డర్లకు టోల్ ప్లాజాల వద్ద నిరంతరాయ సేవలు అందుతాయి. ఆగష్టు 1 నుంచి ఫాస్టాగ్‌లన్ని తప్పకుండా వాహన రిజిస్ట్రేషన్ నం. చాసిస్ నంబరుతో లింకు అయి ఉండాలి. కొత్తగా వాహనాలు కోనేవారి తమ వాహన రిజిస్ట్రేషన్ నంబర్లు మొదటి 90 రోజుల్లో అప్‌డేట్ చేయించుకోవాలి. వాహనం ముందు భాగం వెనుకభాగానికి సంబంధించిన స్పష్టమైన ఫోటోలను ఫాస్టాగ్ ప్రొవైడర్లకు అందించాలి. తద్వారా టోల్‌ప్లాజాల వద్ద వాహనాని న్న గుర్తించడం సులభతరం అవుతుంది. ప్రతి ఫాస్టాగ్ ఒక ఫోన్‌నంబరుతో కనెక్టు అయి ఉంటుంది.దానికి మెసేజ్‌లు, అప్‌డేట్స్ ఎప్పటికప్పుడు వస్తుంటాయి. సాధ్యమైనంత త్వరగా కెవైసీ ప్రక్రియ పూర్తిచేసుకోవాలని కేంద్రం అదేశిస్తుంది.

## బీచ్ కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక - విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



**గడివేముల, జూలై31, ప్రభాతవార్త;** ఉమ్మడి కర్నూలు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలో బీచ్ కబడ్డీ మహిళల జిల్లాస్థాయి పోటీల్లో మండలకేంద్రమైన గడివేములలోని శ్రీ రాజరాజేశ్వరి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఈ.వైష్ణవి పాల్గొని విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యింది. ఈ సందర్భంగా బుధవారంనాడు జరిగిన అభినందన సభలో పాఠశాల కరస్పాండెంట్ ఎం.రామేశ్వరరావు మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా ప్రతిభ కనబరచాలన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. విద్యార్థిని ఈ.వైష్ణవిని అభినందించారు. అనంతరం పాఠశాల ఏఓ ఎంబీఎన్ రాఘవేంద్రరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆత్మవిశ్వాసంతో ముందుకు అడుగు వేస్తే ఏదైనా సాధించగలమన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని, క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.కృష్ణకాంత్, పీఈటీ, అధ్యాపకులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వైష్ణవికి అభినందనలు తెలిపారు.

## సమాజాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర ఎంతో గొప్పది - పదవీ విరమణ చేసిన వ్యాయామ అధ్యాపకురాలికి ఘనసన్మానం



**బనగానపల్లె, జూలై 31, ప్రభాతవార్త:** సమాజాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర ఎంతో గొప్పదని, గౌరవంగా పదవీ విరమణ పొందడం గొప్ప అదృష్టమని రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వ్యాయామ అధ్యాపకురాలు వి.విజయకుమారి ఉద్యోగ విరమణ ఆత్మీయ వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని బుధవారం కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందుతున్న విజయకుమారి భర్త రామకృష్ణారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎంతో మంది క్రీడాకారులను ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకు అహర్నిశలు కృషిచేసి పదవీ విరమణ పొందడం సంతోషించదగ్గ విషయమన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు సమాజసేవలో భాగస్వాముల కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. తాను కూడా డిగ్రీ చదువుతున్నప్పుడు రేకుల షెడ్డుతో తరగతి గదులు ఉండేవని గుర్తు చేసుకుంటూ విద్యార్థులు చూడవలసింది తరగతి గదులు కాదని విద్యను ఏ విధంగా బోధిస్తున్నారో చూడాలని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడల అభివృద్ధి కొరకు వ్యాయామ విద్య విభాగానికి లక్ష రూపాయల నగదును కళాశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వేణుగోపాల్, రాయలసీమ యూనివర్శిటీ స్పోర్ట్స్ బోర్డు కో ఆర్డినేటర్ శివకిషోర్‌లు మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో వ్యాయామ విభాగం అధ్యాపకుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. వ్యాయామ విభాగానికి విజయకుమారి అందించిన సేవలు, సహకారం చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ముఖ్య అతిథులు పదవీ విరమణ పొందిన వ్యాయామ అధ్యాపకురాలు వి.విజయకుమారి, డాక్టర్ రామకృష్ణారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బాబునాథ్, అధ్యాపకులు డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ వసుంధరమ్మ, డాక్టర్ మహమ్మద్ గౌస్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కళ్యాణ్, నీతమ్మ, కౌసల్య, రామన్న, నాగ తిమ్మయ్య, నాగరాజారెడ్డి, రవికుమార్, నారాయణ, నాగరాజు, వహీదా, మూర్తి, రామకృష్ణ విద్యా సంస్థల డైరెక్టర్ హేమంత్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం... రైతులకు ఎంతో లాభదాయకం



**కొత్తపల్లి, జూలై 31, ప్రభాతవార్త:** ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకమని నంద్యాల జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి నరేందర్‌రెడ్డి, సేట్రిస్ ప్రొగ్రామ్ మేనేజరు బి నారాయణ అన్నారు. వారు బుధవారం మండలంలోని పాలెం చెరువు గ్రామం, చెంచు అశ్రమం పాఠశాల అవరణలో రైతు సాధికార సంస్థ అధ్వర్యంలో పండ్ల మొక్కలను పంపిణి చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఐదు అంతస్థుల పండ్లతోటల పెంపకాన్ని చేపట్టాలని వాటితో మధ్యలో అంతర పంటలు కూడ సాగుచేసుకోవచ్చన్నారు. దీని ద్వారా రైతులు నిరంతర ఆదాయం పొందుతూ ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. పండ్లతోటల పెంపకం ద్వారా జీవ వైవిద్యం పెరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం 11 మంది రైతులకు 23 ఎకరాలకు మామిడి, సపోట, నిమ్మ, జామ, కొబ్బరి, ఎర్రచందనం, మహాగని, సీతాఫలంతో కలిపి 4 వేల పండ్ల మొక్కలను అందించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె మహేష్, జిల్లా ప్రకృతి వ్యవసాయ అదనపు అధికారి అబ్దుల్ సలాం, ఏఈఓ వెంకటనారాయణ, ఐటిడిఏ ఏపిఓ రాజునాయక్, టెక్నికల్ అసిస్టెంట్ బాషరన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరేంద్రగౌడ్, నాగరాజు, సయ్యద్ బాష, సరస్వతి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పనిసర్దుబాటు చేపట్టి, సబ్జెక్టు టీచర్ల కొరతను తీర్చాలి - ఎస్టీయు



**కర్నూలు విద్య, జూలై 31, ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రాథమిక/ ప్రాథమికోన్నత/ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వెంటనే పని సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్ గోకారి మరియు సీనియర్ నాయకులు కలిసి జిల్లా విద్యాశాఖాధికారి శ్యాముల్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 2024-25 విద్యాసంవత్సరానికి ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యాప్రవేశాలు గణనీయంగా పెరగడం గత మూడు నెలల నుండి ఉపాధ్యాయులు పదవీ విరమణ చేస్తుండడం సుమారు సుమారు 40 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నతీకరించడం ద్వారా అయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని వెంటనే పని సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలన్నారు. కొన్ని ఉన్నత పాఠశాలల్లో 1000 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులే పనిచేస్తున్నారన్నారు. అదేవిధంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఎన్‌ఓసిలను సత్వరమే మంజూరు చేయాలని, మెడికల్ బిల్లులు కాలయాపన లేకుండా మంజూరు చేయాలని, పెండింగ్ విచారణలను వెంటనే పూర్తిచేసి సస్పెన్షన్‌లో ఉన్న ఉపాధ్యాయులను వెంటనే పాఠశాలల్లో చేరేవిధంగా చర్యలు తీసుకోవాలని కౌతాళం మండల విద్యాశాధికారిని వెంటనే నియమించాలని వేసవి సెలవుల్లో పనిచేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేస్తు ప్రొసిడింగ్స్ ఇవ్వాలని, పదవతరగి మూల్యాంకన నిధులను కొన్ని సబ్జెక్టులకు పూర్తిగా చెల్లించలేదని చర్యలు తీసుకోవాలని, ఉన్నత పాఠశాలలకు ఎఫ్ఎసిలుగా పాఠశాల నాయకులకు అలవెన్సు మంజూరు చేసేవిధంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. డిఈఓ స్పందించి పరిష్కారం చేస్తామని హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో గోవింద్, గోవిందనాయక్, దేవదాసు, సురేష్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆటవస్తువులు పంపిణీ

**వెల్దుర్తి,జూలై31,ప్రభాతవార్త :** క్రిష్ణగిరి మోడల్‌స్కూల్‌లోని విద్యార్థులకు వెల్దుర్తికి చెందిన మీ సేవా నిరా వ్యాహకులు ఎస్.గంగాధర్‌నాయుడు కా ్యరంబోర్డు,కాపీరైట్ పుస్తకాలను,పండ్లను అందించారు.ఈ సందర్బంగా ఆయన మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఎం.నిర్మలకు తన కుమార్తె లేహ్యాశ్రీ పుట్టినరోజును పురస్కరించుకొని వీటిని అందజేశారు.ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపడతానని గంగాధర్‌నాయుడు అన్నారు.విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు.



## ఇంచార్జ్ తహశీల్దార్‌గా బి నాగరాజు



**తుగ్గలి, జూలై 31, ప్రభాతవార్త :** తుగ్గలి మండల డిప్యూటీ తహశీల్దార్ నాగరాజును ఇంచార్జ్ తహశీల్దార్‌గా నియమిస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పనిచేస్తున్న తహశీల్దార్ షర్మిల అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లడంతో డిప్యూటీ తహశీల్దార్ నాగరాజుకు ఇంచార్జ్ తహశీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. దీంతో ఆయన తుగ్గలి మండల ఇంచార్జ్ తహశీల్దార్‌గా భాద్యతలు చేపట్టారు.

## పెద్దకడుబూరులో పారిశుద్ధ్య పనులు



**పెద్దకడుబూరు, జూలై 31, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన పెద్దకడుబూరులో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బుధవారం గ్రామంలో ప్రధాన రహదారి వెంబడి డ్రైనేజీలు శుభ్రపరచి పోలీస్‌స్టేషన్ నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మీదుగా జిల్లా పరిషత్ పాఠశాల వరకు డ్రైనేజీలో పేరుకుపోయిన ముళ్లకంపలను జెసిబిలతో తొలగించారు. చెత్తాచెదారాన్ని తీసివేసి డ్రైనేజీలు శుభ్రపరిచారు. చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తుండడంతో రోడ్డుపై ప్రయాణించే ప్రజలు, పాఠశాలకి వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడేవారని వారి విజ్ఞప్తి మేరకు పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరిగిందని గ్రామ సర్పంచ్ రామాంజనేయులు విలేకర్లకు తెలిపారు. డ్రైనేజీల్లో అనవసరంగా చెత్తాచెదారం వేయకుండ ప్రజలు చూసుకోవాలని డ్రైనేజీలు నిండిన వెంటనే పంచాయతీ, పారిశుద్ధ్య కార్మికులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఇప్పటికే గ్రామంలో పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేయడం జరిగిందన్నారు.

## అడ్డగోలుగా కౌలురైతు కార్డులు సృష్టిస్తున్నారు.

**మద్దికెర, జూలై 31, ప్రభాతవార్త :** మండలంలో అడ్డగోలుగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులు ఏకమై పర్సెంటేజ్ ప్రకారం కౌలు రైతు కార్డులను సృష్టించుకోబోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. కౌలు రైతుగా ఎంపికైన రైతు నుండి పర్సెంటేజ్ ప్రకారం ఈ వ్యవహారం అంతా మండలంలో విచ్చలవిడిగా జరుగుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో జరిగింది కనుక ఇప్పుడు కూడా జరపాల్సిందేనని పలువురు వ్యవసాయ, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అధికారులు చేసేదేమీ లేక ఎలాంటి అగ్రిమెంట్ లేకుండ తెల్లపేపర్ పైనే భూమి యజమాని కౌలుకు ఇస్తున్నట్లు సాక్ష్యాలను సృష్టిస్తున్నారని ప్రజలు గుసగుసలాడుతున్నారు. అయితే గత ప్రభుత్వంలో వేల సంఖ్యలో కౌలు రైతు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ మండలం మొత్తం వందలోపే కౌలు రైతులుగా గత ప్రభుత్వం గుర్తించడం జరిగింది.

## ఆరోగ్యశ్రీ పథకం రద్దు చేయడం తగదు



**హొళగుంద, జూలై 31, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని రద్దు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి అమానుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు రాజీవ్ ఆరోగ్యశ్రీ అనే పథకం ప్రవేశపెట్టి పేదలు ఎన్నో విధాలుగా అనేక రకమైన జబ్బులను ఆరోగ్యశ్రీ ద్వారా చూపించుకున్నారన్నారు. ఈ పథకం అనేకమంది ప్రజలకు ఉపయోగకరంగా మారిందని చాలామంది ప్రాణాలు ఈ పథకం ద్వారా కాపాడారన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు నిరుపేదలకు ఎంతో ఉపయోగకరంగా ఆరోగ్యశ్రీ పథకం ఉందన్నారు. సిఎం చంద్రబాబు రాష్ట్రంలో విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రిలేనిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## జనసైనికులు క్రియాశీలక సభ్యత్వం నమోదు చేసుకోవాలి




**దేవనకొండ, జూలై 31, ప్రభాతవార్త :** జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తెర్నేకల్ వెంకప్ప ప్రారంభించిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం దేవనకొండ పట్టణం నందు క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన మండల కన్వీనర్ వీరేష్, మండల కోకన్వీనర్ మహానంది(నందు), జనసేన నాయకులు రిటైర్డ్ హెడ్మాస్టర్ ఉచ్చీరప్ప, మాజీ ఆర్మీ రామాంజనేయులు మాట్లాడుతూ జూలై 18నుండి ఆగస్టు 5వరకు భాద్యతగా తీసుకుని కష్టపడి పనిచేయాలని కష్టపడ్డ ప్రతి ఒక్క కార్యకర్తకి పార్టీ అధిష్టానం వద్ద నేరుగా గుర్తింపు ఉంటుందన్నారు. జనసైనికులు, వీరమహిళలు విధిగా సభ్యత్వం నమోదు చేసుకుని, చేయించి జిల్లాలోనే అధిక సభ్యత్వాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. క్రియాశీలక సభ్యత్వం నమోదు చేసుకుంటే ప్రమాదవశాత్తు మరణిస్తే ప్రమాద భీమా రూ.5లక్షలు, యాక్సిడెంట్ భీమా రూ.50వేలు పవన్‌కళ్యాణ్ అందచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చంటిబాబు, బడేసాహెబ్, కృపాకర్, కృష్ణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉదయం అయిదు గంటలకు పెన్షన్ పంపిణి

**నందికొట్కూరు, జూలై 31, ప్రభాతవార్త:** ఆగస్టు 1వ తేదీ ఉదయం అయిదు గంటల నుండే 1 నుండి 14 సచివాలయాల పరిధిలో సచివాలయ సిబ్బంది డోర్ టు డోర్ పెన్షన్లను పంపిణి చేస్తారని కావున పెన్షన్ లబ్దిదారులు అందుబాటులో ఉండాలని మున్సిపల్ ఇన్‌చార్జ్ విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

## పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతనాలు చెల్లించాలి




**పత్తికొండ, జూలై 31, ప్రభాతవార్త :** పది వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వై వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం ఏపి వ్యవసాయ కార్మిక సంఘం ఆద్వర్యంలో స్థానిక ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు కూలీలకు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఆవుల శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నబీరసూల్, జిల్లా నాయకులు మద్దిలేటి శెట్టి, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి నెట్టికంటయ్య, పట్టణ కార్యదర్శి నల్లమల, రామాంజనేయులు, జె నరసింహులు, ఉరుకుందు, గుండుభాషా, రాతన బాబా, నాగేంద్ర, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## ఆగస్టు 2న పగిడ్యాల మండల సర్వసభ్యసమావేశం - ఎంపిడిఓ కవిరాజు



**పగిడ్యాల, జూలై 31, ప్రభాతవార్త :** స్థానిక మండల అభివృద్ధికార్యాలయంలో ఆగస్టు 2వతేదీన ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సాధారణ సర్వసభ్యసమావేశం నిర్వహిస్తున్నట్లుమండల అభివద్ధి అధికారి కవిరాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కవిరాజు మాట్లాడుతూ సమావేశానికి జెడ్పీటిసి సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు మండల స్థాయి అధికారులు, సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరుకావలన్నారు. ప్రభుత్వ పథకాలపై క్లుప్తంగా తమ ప్రగతి నివేధికలను ఆరు కాపీలను మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారుల జాభితాను తదుపరి చర్య నిమిత్తం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం పంపడం జరుగుతుందనీ మండల అభివృద్ధి అధికారి కవిరాజు తెలిపారు.

## నూతన ప్రభుత్వం నిద్రమత్తు వీడాలి



**మద్దికెర, జూలై 31, ప్రభాతవార్త :** నూతన ప్రభుత్వం నిద్రమత్తు విడిచిపెట్టి ప్రజా పరిపాలనపై దృష్టి పెట్టాలని మాజీ రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్ రేలంపాడు వెంకటేశ్వర్లు బుధవారం తన స్వగృహంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలకు కొత్త పేర్లు పెట్టడం బాగానే ఉన్నప్పటికీ ప్రారంభించేది ఎప్పుడో చెప్పలేకపోయారన్నారు. పాఠశాలలు ప్రారంభమైనా కొన్ని పాఠశాలల్లో బ్యాగులు, బూట్లు, పుస్తకాలు ఇప్పటివరకు పంపిణీకి నోచుకోలేదన్నారు. రైతులకు పెట్టుబడి సహాయం కింద చేయవలసిన సహాయాన్ని పూర్తిగా మరిచిపోయిందన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఈ సమయం కల్లా రైతులకు పెట్టుబడి సహాయం, అక్కఒడి, విద్యాకానుకలు అందచేసే వాళ్లమని ఇప్పటినుండైనా ప్రజాప్రతినిధులు ఢిల్లీ పర్యటనలు పక్కనపెట్టి ప్రజా పరిపాలన కొనసాగించాలని వారు కోరారు.

## ఆర్‌యు వైస్ ఛాన్సులర్‌గా నియమితులైన ఎన్‌టికె నాయక్‌కు అభినందనలు



**కర్నూలు విద్య, జూలై 31, ప్రభాతవార్తః** రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సులర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య ఎన్‌టికె నాయక్‌కు ఏపీ ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ అఫీసర్స్ అసోసియేషన్ వారు అభినందనలు తెలిపారు. జిల్లా వాసి విశ్వవిద్యాలయానికి వి సి గా నియమితులు కావడం పట్ల వారు హార్షం వ్యక్తం చేశారు. ఆచార్య నాయక్ నాయకత్వంలో విశ్వవిద్యాలయం పురోగతి సాధించగలదని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఏపీ ఎస్సీ, ఎస్టీ, గజిటెడ్ అఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హెడ్‌డి ఈరన్న, కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ క్రిష్టన్న, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి చంద్రశేఖర్, సభ్యులు సురేంద్రనాధ్ తదిరతులు పాల్గొన్నారు.

## వెటర్నరీ డాక్టర్ కోర్సులకు ప్రవేశ నోటిఫికేషన్ జారీ

**నంద్యాల విద్య, జూలై 31, ప్రభాతవార్తః** శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటి ఆధ్వర్యంలో బైపీసీ విద్యార్థులకు బివిఎస్‌సి, పశుసంవర్థకశాఖలో అన్‌లైన్‌లో ధరఖాస్తులు స్వీకరించేందుకు నోటిఫికేషన్ జారీచేసినట్లు రిజిస్ట్రార్ చెంగల్వ రాయుడు పేర్కొన్నారు. వచ్చే 20వ తేది వరకు ఈకోర్సులకు అన్‌లైన్‌లో ధరఖాస్తులు నమోదుచేసుకోవాలన్నారు. అలాగే బిటెక్ డెయిరీ టెక్నాలజీ అభ్యర్థులు ఆగస్టు 12 లోపు ధరఖాస్తు చేసుకోవాలి. రైతు కోటా కింద డెయిరీ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశం కోసం అర్హతగల అభ్యర్థులు ధరఖాస్తులు స్వీకరించేందుకు సిద్దంగా ఉన్నామని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం..!



**హొళగుంద, జూలై 31, ప్రభాతవార్త :** రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమవుతుందని తెలుగుదేశం పార్టీ మాజీ మండల కన్వీనర్, కూటమి నాయకులు వీరన్నగౌడ్, ప్రసాద్, అబ్దుల్ సుభాన్, మోయిన్, జాకీర్‌లు అన్నారు. ఈ సందర్భంగా బుధవారం వారు మాట్లాడుతూ కొంతమంది కూటమి పాలన గిట్టనివారు హొళగుంద, ఆదోని రోడ్డు గురించి సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారన్నారు. అయితే కూటమి ఏర్పడి 45రోజులు మాత్రమే అయ్యిందని ఆలూరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి కోసం దాదాపు రూ.300కోట్లు మంజూరయ్యాయని వీరభద్రగౌడ్ తెలిపారన్నారు. రోడ్డు రవాణా శాఖ మంత్రి బిసి జనార్థన్‌రెడ్డితో వీరభద్రగౌడ్ చర్చించి త్వరలోనే ఆదోని-హొళగుంద, ఆలూరు-హొళగుంద రోడ్డు పనులు ప్రారంభిస్తారన్నారు. అయితే ఇలాంటి వీడియోలు ట్రోల్ చేయడం వల్ల ఒరిగేదేమీ లేదని గత ఐదేళ్ల వైసిపి పాలనలో రోడ్డు వెంబడి ప్రయాణించే వారు నరకయాతన అనుభవించారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రభుత్వం ఏర్పడి 45రోజులు మాత్రమే అయ్యిందని మరికొద్దిరోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుభాన్, అల్తాఫ్, మంగయ్య, గాదిలింగ, సలీం, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## హంద్రీనీవాకు వెంటనే నీళ్లు వదలాలి




**దేవనకొండ, జూలై 31, ప్రభాతవార్త :** కృష్ణా పరివాహక ప్రాంతాలలో, తుంగభద్ర బేసిన్‌లో కురిసిన వర్షాల వలన ఇప్పటికే కృష్ణ, తుంగభద్ర నదుల మీదుగా ఉన్న ప్రాజెక్టుఉ నిండి శ్రీశైలం ప్రాజెక్టు కూడా గేట్లు ఎత్తారని అయితే హంద్రీనీవాకు నీళ్లు వదలకపోవడం రాయలసీమ ప్రాంత రైతాంగానికి తీవ్ర నష్టదాయకమని వెంటనే హంద్రీనీవాకు నీరు వదలాలని సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్, మండల కమిటీ సభ్యులు అశోక్, యూసుఫ్ భాషలు డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ ఇప్పటికే శ్రీశైలం రిజర్వాయర్ నుండి గాలేరు నగరి, వెలుగోడు రిజర్వాయర్, తెలంగాణ తదితర సాగునీటి కాలువలకు నీటిని విడుదల చేసిన ప్రభుత్వం హంద్రీనీవాకు నీళ్లు విడుదల చేయలేదని దీనికి కారణంగా కర్నూలు-గుంటూరు హైవే రోడ్డు మార్గం నిర్మిస్తున్న కాంట్రాక్టర్ బ్రాహ్మణకోట్కూరు దగ్గర హంద్రీనీవా కాలువపై దారి మళ్లింపు నిర్మాణం చేయడం వలన ఆటంకం ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారని జూన్ చివరినాటికి రోడ్డు మళ్లింపు నిర్మాణం పూర్తి చేసి నీటిపారుదల శాఖకు అందచేస్తామని హామీ ఇచ్చిన హైవే కాంట్రాక్టర్ తీవ్ర నిర్లక్ష్యం వలన నేటికీ పూర్తికాకుండ హంద్రీనీవా నుండి నీటి విడుదలకు అడ్డంకిగా నేపథ్యంలో హైవే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమ కరువుకు పరిష్కారంగా 6లక్షల ఎకరాలకు సాగునీరు, దాదాపు 35లక్షల మంది జనాభాకు తాగునీటి సౌకర్యం గల ఈ ప్రాజెక్టు పట్ల ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదన్నారు. పంటలు ఎండిపోయే పరిస్థితికి వచ్చాయని ప్రభుత్వం పరిస్థితిని గమనించి హంద్రీనీవాకు నీటిని విడుదల చేయడం ద్వారా రైతాంగాన్ని ఆదుకోవాలని వారు కోరారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు.

## ప్రతి విద్యార్థినికి కెజీబీవిలో సీటు కల్పించాలి




**ఆలూరు, జూలై 31, ప్రభాతవార్త :** కెజీబీవి విద్యాసంస్థలలో అప్లై చేసుకున్న ప్రతి విద్యార్థినికి సీటు కల్పించాలని, ఖాళీగా ఉన్న బోదన పోస్టులు భర్తీ చేయాలని పిడిఎస్‌యు తాలుక అధ్యక్షులు దుర్గా ప్రసాద్ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ నాయక్ మాట్లాడుతూ కరువు జిల్లాగా ఉన్న కర్నూలు జిల్లా విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని అప్లై చేసుకున్న ప్రతి విద్యార్థికి కెజీబివిలో సీట్ల సంఖ్య పెంచి సీట్లు కల్పించాలన్నారు. ఈ జిల్లాలో పేద, మధ్య తరగతి, బడుగు, బలహీన వర్గాలకు చెందినటువంటి విద్యార్థుల తల్లిదండ్రులు ఇతర రాష్ట్రాలకు వలసలకు వెళ్లి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తమ పిల్లలు కెజీబీవి పాఠశాలలో ఉంటే మంచి విద్య, భద్రత ఉంటుందనే ఉద్దేశ్యంతో చాలామంది తల్లిదండ్రులు కెజీబివి పాఠశాలకు దరఖాస్తు చేసుకోవడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్క విద్యార్థికి సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కెజీబివి పాఠశాలకు సంబంధించి తరగతి గదుల సెక్షన్లు పెంచాలని కోరారు. ఖాళీగా ఉన్న భోదన బోధ నేతల పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కెజీబివి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. టాయిలెట్స్, బాత్‌రూమ్స్, మినరల్ వాటర్ ఏర్పాటు చేయాలన్నారు. నాడు-నేడు పనుల కింద ఉన్న కెజీబివి స్కూళ్లలో పనులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. కెజీబివి పాఠశాల ఎస్ఓలు స్థానికంగా అక్కడే ఉండాలన్నారు. చాలా పాఠశాలలో ఎస్ఓలు స్థానికంగా ఉండకుండ ఉదయం, సాయంత్రం కేవలం అటెండెన్స్‌లు వేసుకోవడానికి మాత్రమే వస్తున్నారని అలాకాకుండ అక్కడ పనిచేసే వారిని, పాఠశాలను చూసుకోవాలన్నారు. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎస్ఓలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి అప్లై చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు కల్పించి, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధు, హనుమేష్, వెంకటేష్‌స్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ విశ్వవిద్యాలయ పురోగతికి సహకరించండి

**కర్నూలు విద్య, జూలై 31, ప్రభాతవార్తః** రాయలసీమ విశ్వవిద్యాలయ పురోగతికి సహకరించాల్సిందిగా రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డిని విన్నవించిన్నట్లు వైస్ ఛాన్సులర్ ఆచార్య ఎన్‌టికె నాయక్ తెలిపారు. బుధవారం మంత్రి బిసిని బనగాయనపల్లెలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వర్శిటి రిజిస్ట్రార్ డా.ఎస్ వెంకటేశ్వర్లుతో కలిసి విశ్వవిద్యాలయానికి సంబంధించిన వివిధ విషయాలను వివరించినట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన మంత్రిగా రాయలసీమ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేయడానికి తనవంతు సహకారం ఎప్పటికి ఉంటుందని మంత్రి బీసీ హామి ఇవ్వడం సంతోషకరమన్నారు.



## నంద్యాల జిల్లా ముగ్గురు డియస్‌పిలు బదిలీలు

**నంద్యాల, జూలై 31,ప్రభాతవార్తప్రతినిధి :** నంద్యాల జిల్లాలో పని చేస్తున్న ముగ్గురు డియస్‌పిలో బదలీ కాగా వారి స్థానము నూతనంగా వివిద ప్రాంతాలనుండి ఇక్కడకు పోస్టింగ్ ఇచ్చారు. అందులో బాగంగా అళ్లగడ్డ డియస్‌పిగా పని చేస్తున్న సఫుద్దీన్ బదలీ చేస్తున్న ఇక్కడకు కడప డిపిటిసి నుండి రవికుమారుకు పోస్టింగ్ ఇచ్చారు,.అలాగే అత్మకూరు ఏలూరు ఉన్న రాంజీనాయక్‌కు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే డోన్ డియస్‌పిగి డిపిటిసిలో ఉన్న పిజశ్రీనివాసులకు పోస్టింగ్ ఇచ్చారు. నంద్యాల పని చేస్తున్న డియస్‌పి కూడా బదలీ చేశారు.

## సర్పంచ్‌పై హత్యాచారయత్నానికి పాల్పడిన తలారిపై కఠిన చర్యలు తీసుకోవాలి




**ఆదోనిలీగల్, జూలై31, ప్రభాతవార్త;** ఆదోని మండలం పెద్దపెండేకల్ గ్రామ సర్పంచ ఉప్పర జయమ్మను హత్యాచారయత్నం చేసిన తలారి నరసింహులుపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖను సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆదోని జనరల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన బాధితురాలిని వారు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు మహిళలపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయన్నారు. అఘాయిత్యాలు, దాడులకు పాల్పడే వారు ఎంతటివారినైనా వదిలిపెట్టరాదని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశరు. లేనిపక్షంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు, జిల్లా కార్యవర్గ సభ్యులు విరూపాక్షి, సీపీఐ మండల కార్యదర్శి సుదర్శన్, నాయకులు బి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పెరుగుతున్న గొర్రెల మరణాలు


**- కారణాలు తెలియక లబోదిబో మంటున్న గొర్రెల కాపరులు..**

**- సంబంధిత పశువైద్యాధికారులు పట్టించుకోవాలని వేడుకోలు..**



**వెల్దుర్తి,జులై31,ప్రభాతవార్త :** వెల్దుర్తి మండలంలోని వెల్దుర్తితో పాటు పలు గ్రామాల్లో గొర్రెలు చనిపోతున్నాయని గొర్రెల కాపరులు తెలిపారు.వెల్దుర్తి పట్టణ సమీపంలోని కొండ ప్రాంతంలో గొర్రెల కాపరులు రాజు,గోవిందు,రాముడులు తాము పెంచుకుంటున్న గొర్రెల మందలో ఏ వ్యాధి సోకిందో అర్థం కావడంలేదని వాపోతున్నారు.ఫలితంగా గొర్రెల మరణాలు సంభవిస్తున్నాయన్నారు.వెల్దుర్తిలోని 15వ వార్డుకు చెందిన బోయరాజు గొర్రెలు కొన్నిరోజుల కిందట 6 దాకా చనిపోయాయని ఆవేదన చెందారు.తాము పెంచుకుంటున్న గొర్రెలు (జీవాలు) మేత తినడం లేదని,నోరంతా ఎర్రగా పొంగినట్లుగా ఉందని వారు పేర్కొన్నారు.ఇప్పటికైనా సంబంధిత పశువైద్య అధికారులు పట్టించుకొని తగు వైద్యసేవలు అందించి తమ గొర్రెలు చనిపోకుండా కాపాడాలని వేడుకుంటున్నారు.

## నీళ్ళ ట్యాంక్‌లో ఉడత చనిపోయినా పట్టించుకోరా



**కొత్తపల్లి, జూలై 31, ప్రభాతవార్తః** కొత్తపల్లి మండలంలోని ముసలిమడుగు జడ్పీ పాఠశాలలోని ట్యాంకులో ఉడత పడి చనిపోయి నీరు దుర్వాసన వస్తున్నా పట్టించుకోవడం లేదని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సాయంత్రం కొంతమంది యువకులు పాఠశాల మైదానంలో ఆటలు అడుకుంటూ ట్యాంకు వద్దకు నీరు తాగేందుకు వెళ్లగా నీరు దుర్వాసన వస్తుండడాన్ని గమనించి ట్యాంకు పై కప్పు తీసి చూడగా ఓ ఉడత మృతిచెందింది. ఆ ఉడత చనిపోయి ఎన్నిరోజులు అవుతుందో అని విద్యార్థుల తల్లిదండ్రులు అందోళన చెందుతున్నారు. అదేనీరు పాఠశాల విదా ్యర్థులు తాగారని తమ పిల్లలు రోగాల బారీన పడితే బాధ్యత ఏవరిదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యమే దీనికి నిదర్శనమన్నారు. అధికారులు స్పందించి విద్యార్థులకు సురక్షితమైన నీటిని అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## కర్నూలు జిల్లాలో తహాశీల్దార్‌ల బదిలీలు

**కర్నూలు విద్య, జూలై 31, ప్రభాతవార్తః** కర్నూలు జిల్లాలో 33 మంది తహాశీల్దార్‌లకు పోస్టింగ్‌లిస్తు జిల్లా కలెక్టరు రంజిత్ బాషా బుధవారం అదేశాల జారీచేశారు. ఎన్నికలకు ముందు జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు ఎన్నికల విధుల కోసం బదిలీపై వెళ్లిన తహాశీల్దార్‌లను తిరిగి కర్నూలు జిల్లా పంపించిన విషయం తెలిసిందే. జిల్లాకు వచ్చిన తహాశీల్దార్‌లకు పోస్టింగ్‌లిస్తు కలెక్టరు అదేశాలు జారీచేశారు.

## నీటికి పూజలు



**ఆదోని,జూలై 31,ప్రభాతవార్త :** మండల పరిధిలోని బసాపురం కాలువ నందు ప్రవహించే నీటికి బుధవారం ఎమ్మెల్యే పార్థసారథి జలహారతి ఇచ్చారు. నీటికి పూజలు జరిపి హారతి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్,కమీషనర్,వార్డు కౌన్సిలర్లు,పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

# కౌన్సిల్ వాయిదా ఎవరి కోసం..?

**:- చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్యే..**

**:- సభ్యులు ఎందుకు గైర్హాజరు..?**

**ఆదోని,జూలై 31,ప్రభాతవార్త :** మున్సిపల్ కౌన్సిల్ బుధవారం జరగాల్సి ఉండగా వాయిదా పడడంతో పట్టణంలో చర్చనీయాంశమైంది. ఆదోని మున్సిపాలిటీలో 42మంది కౌన్సిలర్లు ఉండగా రికార్డు స్థాయిలో వైసిపి 41గెలవగా కేవలం ఒక్క సీటుతో టిడిపి సరిపెట్టుకుంది. రెండున్నర సంవత్సరాల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి ఘనవిజయం సాధించింది. అప్పట్లో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఉండడంతో పాటు ఆదోని వైసిపి ఎమ్మెల్యేగా సాయిప్రసాద్‌రెడ్డి వున్నారు. సాయిప్రసాద్‌రెడ్డి తన మార్క్ చూపించేందుకు 42సీట్లు స్వీప్ చేసి జగనన్న దృష్టిలో పడాలనుకున్నారు. కొన్ని వార్డులను ఏకగ్రీవం చేసుకోగ మిగతా వాటికి ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు జరిగినప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వం లేకపోవడంతో టిడిపి కూడా అంటీఅంటనట్లుగా నామమాత్రపు పోటీ చేయించింది. దీంతో మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రతిపక్షం లేకుండా వైసిపి హవా నడిచింది. గడిచిన రెండున్నర ఏళ్లలో జరిగిన కౌన్సిల్ సమావేశాలకు కౌన్సిల్ సభ్యులు అందరూ తూ.చ తప్పకుండ హాజరు అయ్యేవారు. 2024అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం ఓడిపోవడంతో వందేళ్ల మున్సిపాలిటీలో అసలు సిసలు రాజకీయం మొదలైంది. బుధవారం జరగాల్సిన కౌన్సిల్‌కు కోరం లేక వాయిదా పడింది. సభ్యులు గైర్హాజరు వెనుక దాగివున్న రహస్యం ఏమిటీ..ప్రతిసారి హాజరు అయ్యేసభ్యులు అనూహ్యంగా రాకపోవడానికి మాజీ ఎమ్మెలే ్య చక్రం తిప్పినాడా..?ప్రస్తుత కూటమి ఎమ్మెల్యే పార్థసారథి ఎన్నికల వేళ విరుచుకుపడడం,గెలవడంతో కక్ష తీర్చుకోవడానికి కౌన్సిల్‌లో పెట్టే తీర్మాణాలను ఆమోదించకుండ చేస్తే పనులు ఆగిపోయి ఎమ్మెల్యేకు చెడ్డపేరు తేవడానికి ప్లాన్ వేశారా..అని ప్రజలు చర్చించుకుంటున్నారు. అయితే ఒక నెల క్రితం ప్రస్తుత మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న బోయ శాంతను తప్పించి అదే సామాజిక వర్గానికి చెందిన మరో మహిళను చైర్మన్ కుర్చీలో కూర్చోబెట్టడానికి మాజీ ఎమ్మెల్యే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అందులో భాగంగా వైసిపి కౌన్సిలర్లకు ఒక్కొక్కరికి లక్షన్నర ఇవ్వాలన్నది షరతు. షరతులో భాగంగా అడ్వాన్స్ కింద రూ.50వేలు ఇచ్చినట్లు సమాచారం. వారంలోపు సీట్ మార్చాలనుకున్నప్పుడు ప్రస్తుత చైర్మన్ భర్త రాజీనామా చేసే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యేతో తేల్చిచెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఆగ్రహించిన కౌన్సిలర్లు సమావేశానికి డుమ్మా కొట్టారా..అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. గతంలో కౌన్సిల్ సమావేశానికి అప్పటి ఎమ్మెల్యే హాజరైన సందర్భాలు తక్కువ. ఒకరు మినహాయించి అందరు వారే ఉండడంతో తీర్మాణాలపై ఎలాంటి చర్చ లేకుండానే ఆమోదం తెలిపేవారు. ప్రభుత్వం లేకపోవడంతో కూటమి ఎమ్మెల్యే కౌన్సిల్ మీటింగ్‌కు హాజరు కావడం వల్ల జీర్ణించుకోలేక గైర్హాజరు అయ్యారు. కూటమి ఎమ్మెల్యేగా గెలిచిన తదనంతరం జరిగిన మొట్టమొదటి సమావేశంలోనే కోరం లేకుండా వాయిదా పడింది. కేవలం 10మంది మాత్రమే హాజరయ్యారు. మున్సిపల్ కమీషనర్ 27అంశాలు పొందు పరిచారు. వాటిని కౌన్సిల్‌లో ఆమోదం పొందితే పట్టణ అభివృద్ధితో పాటు ఆదాయం సమకూరుతుంది. ఎమ్మెల్యే రాకమునుపే సభ్యులు లేకపోవడంతో మున్సిపల్ చైర్మన్ వాయిదా వేశారు. ఏదిఏమైనా వైసిపి కౌన్సిలర్లు ఎమ్మెల్యేకు జలక్ ఇచ్చారు అనడంలో సందేహం లేదు. కౌన్సిల్ వాయిదా పడడంలో మాజీ ఎమ్మెల్యే ప్రమేయం ఉందా..లేక చైర్మన్ మార్పిడిలో రాజకీయమా..లేక కూటమి ఎమ్మెల్యేపై ద్వేషమా..అనేది దేవుడికే ఎరుక.

# మహిళా సర్పంచ్‌పై అత్యాచారం,హత్యాయత్నం దారుణం

**:- పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి**



**ఆదోని రూరల్,జూలై 31,ప్రభాతవార్త :** మహిళా సర్పంచ్‌పై అత్యాచారం,అత్యాయత్నం జరగడం అత్యంత దారుణమని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదోని జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెద్దపెండేకల్ సర్పంచ్ జయమ్మని బుధవారం పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి పరామరి ్శంచారు. ఈ సందర్భంగా బిర్రు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా సర్పంచ్‌పై అత్యాచారం యత్నం,హత్యాయత్నం జరగడం దురదృష్టకరమన్నారు. భాద్యులైన తలారి నరసింహులుపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని అలాగే ఫిర్యాదు చేసే సమయంలో సర్పంచ్‌పై దురుసుగా ప్రవర్తించిన ఎస్ఐ ఎర్రిస్వామిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో నిర్లక్ష్యం చేస్తే మా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ నాయకత్వంలో రాష్ట్రం హోం శాఖ మంత్రిని కలిసి న్యాయం కోరుతామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంఘం నాయకులు,భాదితురాలి బంధువులతో కలిసి ఆదోని తాలుక పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేశారు. ఎస్ఐ ఎర్రిస్వామిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ పోలీసులతో వాగ్వివాదానికి దిగడంతో తాలుక సిఐ నిరంజన్‌రెడ్డి నింధితులని రేపటిలోగ అరెస్టు చేస్తామని,ఎస్ఐ ప్రవర్తనపై ఉన్నతాధికారులకు రిపోర్టు పంపిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసయాదవ్,రాష్ట్ర కార్యదర్శి రామచంద్రుడు,పంచాయతీ రాజ్ చాంబర్ జిల్లా నాయకులు మహబూబ్ భాషా,సర్పంచ్‌ల సంఘం జిల్లా కార్యదర్శులు రంగారెడ్డి,ఆదోని డివిజన్ అధ్యక్షులు సుధాకర్,నాయకులు లక్ష్మన్న,శివన్న,కేశన్న,రాముడు తదితరులున్నారు.

## జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన బ్రహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు



**కర్నూలు విద్య, జూలై 31, ప్రభాతవార్తః** కర్నూలు జిల్లాకు వచ్చిన నూతన ఎస్పీ జి బిందు మాదవ్‌ను ఆంధ్రప్రదేశ్ బ్రహ్మణ సంక్షేమ సమాఖ్య తరుపున రాష్ట్ర అధ్యక్షులు యన్ వెంకటరామరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్బంగా ఏపీ బ్రహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఎన్ వెంకటరామరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో బ్రహ్మణులపై జరుగుతున్న దాడులు మరియు ఆస్తుల కబ్జాలను అరికట్టాలని జిల్లా ఎస్పీని కోరినట్లు ఆయన తెలిపారు.

## శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న సర్వోన్నతాధికారి



**శ్రీశైలంప్రాజెక్టు,జూలై31,ప్రభాతవార్త :** అష్టదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాపుణ్యక్షేత్రంను బుదువారంనాడు నంద్యాల జిల్లా సర్వోన్నతాధికారి రాజకుమారి,జాయింట్ కలేక్టర్ విష్ణు చరణ్‌లు శ్రీశైల మల్లన్న దర్శనార్థమై ఆలయం వద్దకు చేరుకున్నారు.వారికి ముందుగా ఆలయ రాజగోపురం వద్ద ఆలయ ఈఓ పెద్దిరాజు సాదర స్వాగతం పలికారు.అనంతరం శ్రీస్వామిఅమ్మవారి ఉభయ దేవాలయాలను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.అనంతరం వారికి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ప్రాకార మండపంలో ఈఓ డి.పెద్దిరాజు శ్రీస్వామివారి శేషవస్త్రములతో ఘనంగా సత్కరించి లడ్డు ప్రసాదాలను అందజేసి శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటంను భహుకరించారు.



## నేడు పెండేకల్ ఆర్ఎస్‌లో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం నమోదు

**:- జనసేన పార్టీ మండల నాయకుడు రాజేష్**




**తుగ్గలి,జూలై 31,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెండేకల్ ఆర్ఎస్ గ్రామంలో నేడు నాల్గవ విడత జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని జనసేన పార్టీ అధ్యక్షులు,రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు నిర్వహించడం జరుగుతుందని జనసేన పార్టీ మండల నాయకుడు రాజేష్ బుధవారం ఓ ప్రకటలో తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జూలై 18వ తేదీ నుండి ఆగస్టు 5వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే పెండేకల్ ఆర్ఎస్‌లో నేడు జరగనున్న జనసేన పార్ ్టీ క్రియాశీలక సభ్యత్వాన్ని జనసైనికులు,వీరమహిళలు,నాయకులతో పాటు జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులైన ప్రతిఒక్కరు తమ జీవిత భద్రత కొరకు సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరారు. గత ఏడాది సభ్యత్వాలను రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. క్రియాశీలక సభ్యత్వానికి ఆధార్,పాస్ ఫోటో,నామిని ఆధార్,రూ.500లు చెల్లించాలన్నారు. జనసేన పార్ ్టీ సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి జనసేన పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఏదైన ప్రమాదవశాత్తు గాయపడితే వైద్య ఖర్చులకు రూ.50వేలు,ఆర్థిక సహాయం,ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5లక్షలు ప్రమాద భీమా,జనసేన పార్టీ సభ్యత్వం కిట్టు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే మండలంలో పార్టీ యొక్క కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లి 2029లో రాష్ట్రంలో జనసేన పార్టీ అధికారంలోకి రావడానికి తమవంతు భాద్యతగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు అల్తాఫ్, నరేంద్ర,రామాంజి,రవితేజ,షౌకత్,ఇమామ్,వలి,మాబు వలి,వినోద్ తదితరులున్నారు.

## నాసిరకం పనుల అవినీతిపై సిబిఐ విచారణ జరపాలి




**ఆదోని రూరల్,జూలై 31,ప్రభాతవార్త :** మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి హయాంలో నిర్మించబడిన బసాపురం సమ్మర్ స్టోరేజ్‌ట్యాంక్,సంతెకూడ్లూరు సమ్మర్ స్టోరేజ్ టా ్యంకుల నాసిరకం పనుల అవినీతిపై సిబిఐ విచారణ జరిపి నింధితులను శిక్షించాలని,సదరు ట్యాంకుల మరమత్తులకు నిధులను అవినీతి పరుల నుంచి ఎమ్మెల్యే పార్థసారథి కక్కించాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి(ఎంహెచ్‌పిఎస్) రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తాను మోడీ శిష్యుడినని చెప్పుకునే ఎమ్మెల్యే పార్థసారథి తలుచుకుంటే మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై సిబిఐ విచారణ వేయించడం పెద్ద పనేమీ కాదన్నారు. బసాపురం,సంతెకూడ్లూరు ఎస్ఎస్ ట్యాంకులు దెబ్బతినడంతో పట్టణ,గ్రామాలకు తీవ్రమైన నీటి సమస్య నెలకొన్నదన్నారు. మరి ఇంతటి పెను సమస్యకు కారకులైన నాయకులు,కాంట్రాక్టర్లు,ఇంజనీర్లు, అధికారులు చట్టం నుంచి తప్పించుకుని స్వేచ్ఛగా తిరగడం ఆదోని ప్రజలను అవమానించడమేనన్నారు. గత పాలకుల అవినీతిపై చర్యలు తీసుకోకపోతే ఆదోనిలో అవినీతి చేసినా పట్టించుకునే వారు ఉండరు,ఎలాంటి శిక్ష పడకుండ క్షేమంగా ఉండవచ్చు అనే తప్పుడు సంకేతాలు వెళతాయని కావున చర్యలు తీసుకోవాలన్నారు. కావున ఎమ్మెల్యే,నాయకుల అవినీతి,అక్రమాలపై కేసులు పెట్టి ఆదోనిలో అవినీతి అంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ గత పాలకుల అవినీతిపై ఎమ్మెల్యే కేసులు పెట్టకపోతే మేము ప్రభుత్వాన్ని ఆశ్రయించి కేసులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో వసీమ్ సాహెబ్,హసన్,అబిద్ అలి తదితరులున్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ప్యాకల్టీ పోస్టు కోసం దరఖాస్తులు

**నందికొట్కూరు, జూలై 31,ప్రభాతవార్త:** నందికొట్కూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోటనీ మరియు మ్యాథ్స్ విభాగాలలో అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లుగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్.సునీత తెలిపారు. విద్యార్హత అనుభం మరియు పూర్తి వివరాలతో కూడిన బయోడేటాను, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలను కళాశాల ప్రిన్సిపాల్ కు ఆగష్టు నెల 7వ తేదీలోగా చేరే విధంగా కళాశాల అడ్రస్సుకు గాని లేదా ఈ మెయిల్ ద్వారా గాని పంపవచ్చునని ఆమె తెలిపారు.